క్లుప్తంగా

ఉపాధ్యాయులు వినూత్నంగా బోధించాలి



పెనుగొలను(గంపలగూడెం): ఉపాధ్యాయులు బోధనలో ఎప్పటికప్పుడు కొత్త అంశాలను నేర్చుకుంటూ, విద్యార్థులకు మూస పద్ధతిలో కాకుండా వినూత్నంగా బోధించాలని ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు అన్నారు. మంగళవారం పెనుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇంగ్లిష్ సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బోధనలో మెలకువలను ఉపాధ్యాయులకు సూచించారు. కాలానుగుణంగా వచ్చే మార్పుల దృష్ట్యా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై కూడా ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. కాంప్లెక్స్ చైర్మన్ కిష్టాఫర్, రిసోర్స్‌పర్సన్లు ఎం. రాంప్రదీప్, వై. రవికాంత్, ఎస్వీఎస్ శాస్త్రి ఇంగ్లిష్ సబ్జెక్టు బోధనలో శిక్షణ ఇచ్చారు.

లక్ష తులసి దళార్చన



నెమలి(గంపలగూడెం): నెమలి వేణు గోపాలస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినోత్సవం సందర్భంగా స్వామికి లక్ష తులసి దళార్చనను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు అర్చక బృందం అర్చనలు, శ్రీ కృష్ణ తారక మహా హోమం, శాంతి హోమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ సహాయ కమిషనర్ ఎస్. వెంకట సాంబశివరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు. గంపలగూడెం సీత రామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు దేవయనిజం శ్రీధరాచార్యులు విష్ణు సహస్రనామ పారాయణం రామానుజ అష్టోత్తరం జరిపారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

23న తిరుపతమ్మ- గోపయ్య స్వామి వార్ల కల్యాణ మహోత్సవం

మైలవరం: మైలవరం మండలం బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ, గోపయ్యస్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఈ నెల 23న రాత్రి 9.26 గంటలకు జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్వీ సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ పూజారి జాజుల తిరుపతమ్మ దంపతులతో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ చెలికాని సత్యవర ప్రసాద్ దంపతులచే కల్యాణం వైభవంగా నిర్వహిస్తామని వివరించారు.

సేవా కార్యక్రమాల్లో పోటీ పడాలి



తిరువూరు: వాసవీ క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో పోటీ పడాలని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ సతీష్ అన్నారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో మంగళవారం వాసవీ, వనిత, యూత్, సీనియర్ సిటిజన్, కపుల్ క్లబ్‌లకు కొత్త కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సతీష్ మాట్లాడుతూ పేదలకు సాధ్యమైనంత ఎక్కువగా సహాయపడే విధంగా కార్యక్రమాలను రూపొందించుకోవాలన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా నాళ్ల కృష్ణారావు, వనిత క్లబ్‌కు రాయల చంద్రకళ, యూత్ క్లబ్‌కు దారా దిలీప్, కపుల్స్ క్లబ్‌కు దారా శ్రీనివాసరావు, సీనియర్ సిటిజన్ క్లబ్‌కు నాళ్లా సూర్యప్రకాశరావులు అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ జిల్లా, జోనల్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ కళాజాతా

చాట్రాయి: ప్రధాని మోదీ కేంద్రంలో విప్లవాత్మకమైన పాలన చేస్తున్నారని సినీ గేయ రచయిత అనంత్ శ్రీరామ్ అన్నారు. మంగళవారం మండలంలోని చనుబండ, చిన్నంపేట, మర్లపాలెం గ్రామాల్లో జబర్దస్త్ బృందంతో బీజేపీ తరఫున నిర్వహించిన కళాజాతాలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం జబర్దస్త్ బృందం సభ్యులు అదిరే అభి, నవీన్, బాబీ, వినోద్, ఇమ్మాన్యేలతో కామెడీ షో నిర్వహించారు.

యోగాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆలయంలోని యోగాంజనేయ స్వామికి తమలపాకులతో అర్చనను వైభవంగా జరిపించారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని శోభనాచల స్వామివారికి అష్టోత్తర శత కలశ స్నపన, స్వామికి విశేషాలంకరణను అర్చకులు జరిపించారు. అనంతరం యోగాంజనేయ స్వామికి పంచామృత స్నపన, సహస్ర తమలపాకులతో అర్చన, అప్పాల నివేదన, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్ప తీర్థప్రసాద వినియోగాలను అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

వలంటీర్ల సేవలు అజరామరం

నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



ముసునూరులో వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తదితరులు



ఎ.కొండూరులో వలంటీర్లను సన్మానిస్తున్న స్వామిదాసు

ముసునూరు: గ్రామ/వార్డు వలంటీర్ల సేవలు అజరామరమని, రాష్ట్రమంతా వారికి రుణపడి ఉందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి ఆధ్వర్యంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన మంగళవారం ముసునూరులో సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర పురస్కార గ్రహీతలను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో పింఛనుదారులు పడిగాపులు పడుతూ నరకయాతన అనుభవించేవారన్నారు. సంక్షేమ పథకాల కోసం పేదలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు. అనంతరం మండల వ్యాప్తంగా సేవా వజ్రలుగా నిలిచిన తాడిగడప నాగకల్యాణవర్మ (గోపవరం-1), దారా పావని (కాట్రేనిపాడు), సేవా రత్నాలుగా నిలిచిన జానా రమాదేవి (గోపవరం-1), గుడిమెల్లి రాజేష్ (గోపవరం-2), రాపర్ల నాగదివ్య (కాట్రేనిపాడు), పేరం నాగరాజు(లోపూడి), యడ్లపల్లి మేరి(వలసపల్లి)లను శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ జి.కృష్ణంరాజు, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పద్మావతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, డీటీ ఎమిలీకుమారి, ఈఓపీఆర్డీ శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వ్యవసాయ సొసైటీల అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు మరువలేనివి

చాట్రాయి: ప్రభుత్వ పథకాలను ప్రజలకు సకాలంలో అందిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే పథకాలు దక్కేవని, ఆ పథకాలు ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి అప్పట్లో ఉండేదని, పింఛన్ కోసం వృద్ధులు, వికలాంగులు చెట్లకింద రోజులపాటు పడిగాపులు పడేవారని ఆయన గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతినెలా ఠంచన్‌గా ఒకటో తేదీ తెల్లవారుఝామున ఇంటి తలుపు కొట్టి వలంటీర్ పింఛన్ అందిస్తున్నారని వివరించారు. గత పాలనకు, జగనన్న పాలనకు తేడాను గమనించాలని ప్రజలను కోరారు. ప్రజలను ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందని, రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం ఐదుగురు వలంటీర్లకు సేవారత్న, 285 మందికి సేవా మిత్ర అవార్డులు ప్రదానం చేశారు. ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంకా నిర్మల, ఎంపీడీఓ మంగా కుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చెలికాని బాబ్జీ, దామెర ప్రసాదుబాబు, కారంగుల వాసు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం..



విస్సన్నపేటలో వలంటీర్ రాజగోపాలస్వామిని సన్మానిస్తున్న స్వామిదాసు, నాయకులు



చాట్రాయిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

విస్సన్నపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వలంటీర్లకు సేవా పురస్కారాలు ప్రదానోత్సవం మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ఎంతో సేవా దృక్పథంతో వలంటీర్లు అనేక సేవలు అందించారని కొనియాడారు. మండలంలోని కలగర వలంటీర్ అజ్మీర రాజగోపాలస్వామి సేవా వజ్ర పురస్కారం అందుకున్నారు. ఐదుగురు వలంటీర్లు సేవా రత్న పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ దోర్నాల దామోదరరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ జి. విజయ కుమారి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వారి సేవలు మరువలేనివి..

ఏ.కొండూరు: వలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. మంగళవారం ఎ.కొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ వలంటీర్ల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్వామిదాసు మాట్లాడుతూ దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా పథకాలను లబ్ధిదారుల ఖాతాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం జమచేస్తోందని వివరించారు. వలంటీర్ల సేవలను కొనియాడారు. అనంతరం సేవావజ్రకు ఎంపికైన జి. నాగేశ్వరరావు, బి. దాసు, సేవారత్నకు ఎంపికైన కె. సురేష్, పి అశోక్, జి. కల్పన, బి. ఇంద్రజ, బి. నాగేంద్ర నాయక్‌లతో పాటు 299 మంది సేవా మిత్రులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. జెడ్పీటీసీ భూక్య గనియా, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వి. బ్రహ్మానందరెడ్డి, టి. వెంకటేశ్వరరెడ్డి, డి. సతీష్, కె. చెన్నారావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

నూజివీడు: వలంటీర్లకు వందనం కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ కె. కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. పట్టణంతో పాటు నూజివీడు మండలానికి చెందిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవామిత్ర అవార్డులు అందజేయడంతో పాటు ప్రోత్సాహక నగదును సైతం అందిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. నూజివీడు మండలంలో ఐదుగురికి సేవా రత్న, 431 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులు, నూజివీడు పట్టణంలో సేవా వజ్ర ఒకరికి, సేవామిత్ర ఐదుగురికి, సేవా రత్న 293 మందికి అందిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి తెలిపారు.

- ఆగిరిపల్లి: గ్రామ వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానోత్సవం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 4 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ శామ్యూల్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడు: విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని పోతురెడ్డిపల్లి రోడ్డులో ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-327 నూతనంగా ఏర్పాటు చేసుకున్న యూనియన్ కార్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘటితంగా ఉండి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. నూజివీడులో పలు సంఘాలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామమన్నారు. యూనియన్లకు ఏమైనా సమస్యలు ఎదురైతే వాటి పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటానన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎమ్మెల్యే ప్రతాప్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ. సత్యనారాయణ, పట్టణ డీఈ ఓలేటి దుర్గారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులుంటే తెలియజేయండి

ఆర్డీఓ మాధవి



తిరువూరు: ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులుంటే తమకు తెలియజేయాలని తిరువూరు ఆర్డీఓ మాధవి కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఓటర్ల చిరునామా, పేర్లు ఇతర వివరాలను ఇప్పటికే బీఎల్ఓలు సమగ్రంగా పరిశీలించి సవరించారని, ఇంకా ఏమైనా పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం, సీపీఎం, సీపీఐ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తుది దశకు చేరుకున్న పనులు

- రూ. 25 కోట్లతో ఏరియా ఆస్పత్రిలో నూతన భవన నిర్మాణం
- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



ఆస్పత్రిలో నిర్మించిన నూతన భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: స్థానిక ఏరియా ఆస్పత్రిలోని నూతన భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకొన్న నేపథ్యంలో రెండు రోజుల్లో మిగిలిన పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సూచించారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రూ. 25 కోట్లతో నిర్మించిన నూతన జీ+3 భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పరిశీలించారు. ఈనెల 24న ఈ భవనాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో ప్రారంభోత్సవ పనులను, తుది దశకు చేరుకున్న పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నూజివీడు డివిజన్‌తో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని రెడ్డిగూడెం, మైలవరం, ఎ. కొండూరు, విస్సన్నపేట, కృష్ణాజిల్లాలోని బాపులపాడు మండలాల ప్రజలు కూడా ఈ ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నారన్నారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించిందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రిని తలపించేలా నిర్మించిన ఈ నూతన భవనంలో ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, ల్యాబొరేటరీలు, రోగులకు సంబంధించిన వార్డులు, అన్ని విభాగాలకు ఓపీలు తదితర అనేక వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆస్పత్రులను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశారన్నారు. నూజివీడు పట్టణంలో నూతనంగా రెండు ఆస్పత్రులను, ముసునూరు, ఆగిరిపల్లిలలో మరో రెండు నూతన ఆస్పత్రులను నిర్మించారన్నారు. ఏరియా ఆస్పత్రిలో కోటి రూపాయల వ్యయంతో ఆక్సిజన్ ప్లాంట్‌ను సైతం నిర్మించి ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచిందన్నారు. ఇదంతా అభివృద్ధి కాదా అని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ ప్రతిపక్షాలను నిలదీశారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రులను గాని, ప్రజల ఆరోగ్యాన్ని గాని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. నూతన ఆస్పత్రి భవనాన్ని ఈనెల 24న ప్రారంభించి రోగులకు నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, వైద్యులు పాల్గొన్నారు.

పల్లెలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

మైలవరం నియోజకవర్గంలో నాలుగు సబ్ స్టేషన్ల నిర్మాణం



మైలవరంలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్

మైలవరం: విద్యుత్ సబ్ స్టేషన్‌ల నిర్మాణంతో గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మైలవరం నియోజకవర్గంలో నూతనంగా గత నాలుగున్నర సంవత్సరాల్లో నాలుగు సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టారు. మైలవరంలో నూతనంగా రూ.25 కోట్ల అంచనాలతో 132/33 ఎండబ్ల్యూ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ నిర్మాణం పూర్తయితే ఇటు గృహ వినియోగదారులకు, వ్యాపారులకు, రైతులకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతుందని ఎలక్ట్రిసిటీ అధికారులు తెలిపారు. కాగా మైలవరం మండలంలో 15,019 గృహాల కనెక్షన్లు, 2,251 వాణిజ్య కనెక్షన్లు, పారిశ్రామికంగా 64 కనెక్షన్‌లు, వీధి దీపాలు, వాటర్ వర్క్సుకు 257 కనెక్షన్‌లు, వ్యవసాయానికి 3,147 మొత్తం 20,758 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గతంలో ముఖ్యంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. లోడుకు మించి కనెక్షన్లు ఉండటంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, లో ఓల్టేజ్‌తో ఇళ్లలో ఎలక్ట్రికల్ సామాన్లు కాలిపోవడం వంటి ఘటనలు జరిగేవి. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన అనంతరం రాజీపడకుండా తీసుకున్న నిర్ణయాలతో విద్యుత్ పంపిణీ విధానంలో మార్పులు జరిగి రైతులకు నిరంతరం 9 గంటలు విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఇళ్లు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుంది.

మామిడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన



జి.కొండూరు: ప్రస్తుత కాలంలో మామిడిలో వచ్చే తేనె మంచు పురుగు, తామర పురుగుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఉద్యాన శాఖాధికారి పరమేశ్వరరెడ్డి అన్నారు. ఆత్కూరు గ్రామంలో రైతు నూతక్కి రాంప్రసాద్‌కు చెందిన మామిడితోటలో రైతులకు యాజమాన్య పద్ధతులపై అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. తేనెమంచు పురుగు, తామర పురుగు నివారణకు చేపట్టవలసిన చర్యలను రైతులకు వివరించారు. ఉద్యాన శాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

రేపు ఉత్సవ ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం

ముసునూరు: చారిత్రక శైవ క్షేత్రం బలివేలో మార్చి 7 నుంచి 9 వరకు జరుగనున్న బలే రామలింగేశ్వర స్వామి మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై నూజివీడు ఆర్డీఓ వై.భవానీ శంకరి ఆధ్వర్యంలో అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, కమిటీ అధ్యక్షుడు నాగుల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గురువారం ఉదయం 11 గంటలకు బలివే ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల నోడల్ అధికారి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎమిలీకుమారి అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరుగుతుందన్నారు. అధికారులంతా తమ శాఖకు సంబంధించిన సమగ్ర సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.


పార్థీవదేహం మెడికల్ కళాశాలకు అందజేత



విజయలక్ష్మి (ఫైల్)

విస్సన్నపేట: స్థానిక కాకతీయ కమ్మ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ కాంట్రాక్టర్ చలసాని వెంకటేశ్వరరావు సతీమణి విజయలక్ష్మి (73) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి తదితరులు విజయలక్ష్మి మృతదేహం వద్ద నివాళులర్పించారు. విజయలక్ష్మి పార్థీవ దేహాన్ని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు మంగళవారం కుటుంబ సభ్యులు అందజేశారు.

వ్యవసాయ రంగంపై అవగాహన అవసరం



గరికపాడు(జగ్గయ్యపేట): విద్యార్థులు చదువుతో పాటు వ్యవసాయ రంగంపై అవగాహన కలిగి ఉండాలని కేవీకే కో ఆర్డినేటర్ కృష్ణం రాజు పేర్కొన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని తపోవన్ పాఠశాల 8, 9 తరగతుల విద్యార్థులు మంగళవారం కేవీకేలో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పుట్టగొడుగుల పెంపకం, పౌష్టికాహారం ఆవశ్యకత, మొక్కల పెంపకంతో పాటు మట్టి నమూనా పరీక్షలు వంటి వ్యవసాయ అనుబంధ అంశాలను శాస్త్రవేత్తలు వివరించారు. కేవీకే కో ఆర్డినేటర్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతుల్లో చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధీర్, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం

వీఅన్నవరం(వీరులపాడు): మండలంలోని వీఅన్నవరం గ్రామంలో ఆంజనేయ స్వామి జీవ ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మంగళవారం గణపతిపూజ, శాంతి పఠనం, వేద పారాయణం, పుణ్యాహవచనం కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా ప్రతిష్ఠించనున్న జీవ ధ్వజ స్తంభానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వల్లాపురి రామ కోటేశ్వరరావు, సర్పంచ్ జమ్ముల వరబాబు, మాజీ సర్పంచ్ శేషగిరిరావు, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యం

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి సంపూర్ణ రక్షణ కలుగుతుందని ఎంపీటీసీ పుచ్చకాయల వెంకటేశ్వరరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ పద్మావతిదేవి ఆధ్వర్యంలో మంగళవారం అక్కిరెడ్డిగూడెం యూపీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామ శిబిరం నిర్వహించారు. 497 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, నలుగురిని మెరుగైన వైద్యం కోసం నూజివీడుకు రిఫర్ చేశారు. 58 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 18 మందికి కళ్లజోళ్లు అందజేశారు. సర్పంచ్ పి.లక్ష్మి, వైస్ సర్పంచ్ డి. వరహాలు, ఎం.బీబీ సుజాత, మాజీ ఎంపీటీసీ బర్మా సీతారామయ్య, వైద్య శాఖ, సచివాలయాల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

280 మందికి వైద్య సేవలు

చాట్రాయి: చీపురుగూడెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 280 మందికి పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, దుర్గా ప్రసాద్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఓబిళ్లనేని వెంకటేశ్వరరావు, చీకటి శ్రీనివాసరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

22న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

తిరువూరు: తిరువూరు నుంచి తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసును ఈ నెల 22న నడుపుతామని తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వేణు తెలిపారు. 22న సాయంత్రం 4 గంటలకు తిరువూరు నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం మీదుగా శుక్రవారం రాత్రి అరుణాచలం పుణ్యక్షేత్రానికి చేరుతుందన్నారు. గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం 24న తిరుగు ప్రయాణంలో కంచి, తిరుత్తణి, శ్రీకాళహస్తి మీదుగా ఆదివారం రాత్రికి తిరువూరు చేరుతుందని తెలిపారు. అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ కోసం సెల్: 98856 61835 నంబరును సంప్రదించాలని కోరారు.

యోగాతో శారీరక. మానసిక వికాసం

ఆగిరిపల్లి: యోగాసనాలు వేయడం వలన శారీరక దారుఢ్యం, మానసిక వికాసం పొందవచ్చని ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ వెంకట్రావు అన్నారు. పోతవరప్పాడు ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ కో-ఆర్డినేటర్ స్వామి పరమర్థ దేవి, యువభారత్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ స్వామి రీత్ దేవి విద్యార్థులతో యోగాసనాలు సాధన చేయించారు.

దివ్యాంగ బాలలను ఆదరించాలి

ముసునూరు: దివ్యాంగ బాలలను ఆదరించి, అక్కున చేర్చుకోవాలని రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లోకరాజు అన్నారు. మంగళవారం సమగ్ర శిక్షా అభియాన్ ముసునూరు మండల విభాగం ఆధ్వర్యంలో రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఫిజియో థెరపిస్ట్ జి.ప్రశాంతి దివ్యాంగ బాలలకు ఫిజియోథెరపీ చేయించారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

తిరువూరు: స్థానిక తోకపల్లి సెంటర్లో గత శనివారం అర్ధరాత్రి ముగ్గురు యువకులపై కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేసిన నిందితులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మాటామాటా పెరిగి తిరువూరుకు చెందిన యువకులు ఆరిఫ్, సయ్యద్, అఫ్రోజ్‌లపై శ్రీకాకుళపు మహేశ్వరరావు, రమేష్‌చారి, ఉడతా నరసింహం దాడి చేసి కత్తులతో పొడిచినట్లు కేసు నమోదు చేసి నిందితులను స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.